

WWW.VIJAYAKERATAM.COM

RNI: APTEL/2010/34724

తెలుగు దినపత్రిక

విజయకెరటం

నిజం మా ధ్యేయం - ప్రజలే మా లక్ష్యం

VIJAYA KERATAM TELUGU DAILY



సెప్టెంబర్ 25 శుక్రవారం 2026 | సంపుటి : 18 | సంచిక : 232 | పేజీలు : 4 | వెల రూ. 1.00/- | ఎడిటర్ : యం.డి.మక్సూద్ అహ్మద్

FRIDAY SEPTEMBER 25 2026 | VOL:18 | ISSUE: 232 | PAGES:4 | Rs. 1:00 | EDITOR:MD. MaKsood Ahmed

సీఎం రేవంత్ రెడ్డికి ప్రతిష్టాత్మక పురస్కారం..

'బెస్ట్ పబ్లిక్ సర్వెంట్-2026' అవార్డుకు ఎంపిక

తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి ప్రతిష్టాత్మక పురస్కారం ఆర్యదాన్ మహమ్మద్-2026కు ఎంపికయ్యారు. ఈ ఏడాది బెస్ట్ పబ్లిక్ సర్వెంట్ అవార్డును ఆయన అందుకోనున్నారు. శుక్రవారం కేరళలోని నిలంబూరులో జరిగే కార్యక్రమంలో సీఎం రేవంత్ రెడ్డికి ఈ అవార్డును నిర్వాహకులు ప్రదానం చేయనున్నారు.

సీఎం రేవంత్ రెడ్డికి ప్రతిష్టాత్మక పురస్కారం.. 'బెస్ట్ పబ్లిక్ సర్వెంట్-2026' అవార్డుకు ఎంపిక

హైదరాబాద్, సెప్టెంబర్ 24: తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి ప్రతిష్టాత్మక పురస్కారం ఆర్యదాన్ మహమ్మద్-2026కు ఎంపికయ్యారు. ఈ ఏడాది బెస్ట్ పబ్లిక్ సర్వెంట్ అవార్డును ఆయన అందుకోనున్నారు. శుక్రవారం కేరళంలోని నిలంబూరులో జరిగే కార్యక్రమంలో సీఎం రేవంత్ రెడ్డికి ఈ అవార్డును నిర్వాహకులు ప్రదానం చేయనున్నారు. రేవంత్ రెడ్డి పాలనలో రైతులు, బీసీలు, సామాన్య పౌరుల కోసం చేపట్టిన సంక్షేమ కార్యక్రమాలకుగాను ఆయనను ఈ పురస్కారానికి ఎంపిక చేసినట్లు నిర్వాహకుల జ్యూరీ వెల్లడించింది. ప్రజాస్వామిక విలువలపై సీఎం రేవంత్ రెడ్డి నిబద్ధతను ఈ సందర్భంగా జ్యూరీ ప్రశంసించింది. ఆర్యదాన్ మహమ్మద్ నాలుగో వర్ధంతి సందర్భంగా రేపు (శుక్రవారం)



ఈ పురస్కారాన్ని సీఎం రేవంత్ రెడ్డి అందుకోనున్నారు. కేరళంలో కాంగ్రెస్ పార్టీకి చెందిన దివంగత సీనియర్ నేత, మాజీ మంత్రి ఆర్యదాన్ మహమ్మద్ స్మారకార్థం ఈ పురస్కారాన్ని ఏర్పాటు చేశారు.

జ్ఞానేశ్ కుమార్ దేశద్రోహి.. తక్షణమే దిగిపోవాలి: రాహుల్ గాంధీ డిమాండ్

ఢిల్లీలో రాహుల్ గాంధీ ప్రెస్ మీట్

మోదీ, అమిత్ షాలు 'ఓట్ల దొంగతనం' చేస్తున్నారని సంచలన ఆరోపణ

సీఈసీ వెంటనే రాజీనామా చేసి, అప్రూవర్‌గా మారాలని డిమాండ్

ఈసీలో అంతర్గత విభేదాల వార్తల నేపథ్యంలో రాహుల్ వ్యాఖ్యలు

ప్రజాస్వామ్యాన్ని నాశనం చేస్తుంటే చూస్తూ ఊరుకోబోమని స్పష్టీకరణ

లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ కేంద్ర ప్రభుత్వం, ఎన్నికల సంఘంపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ) జ్ఞానేశ్ కుమార్ ఒక "దేశద్రోహి" అని, ఆయన దేశానికి వ్యతిరేకంగా పనిచేస్తున్నారని ఆరోపిస్తూ తక్షణమే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షాల ప్రమేయంతో దేశంలో 'ఓట్ల దొంగతనం' జరుగుతోందని సంచలన ఆరోపణలు చేశారు. జ్ఞానేశ్ కుమార్ ను ఆయన 'పరిరక్షకులే' కాపాడుతున్నారని మండిపడ్డారు. గురువారం న్యూఢిల్లీలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడిన ఆయన, దేశంలో ప్రజాస్వామ్యాన్ని ధ్వంసం చేస్తుంటే కాంగ్రెస్ పార్టీ చూస్తూ మౌనంగా ఉండదని హెచ్చరించారు. ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణకు సంబంధించి గత 10 నెలల్లో ఇతర ఇద్దరు ఎన్నికల కమిషనర్లు సుఖ్‌బీర్ సింగ్ సంధు, వివేక్ జోషి దాదాపు 14 సార్లు అధికారికంగా అభ్యంతరాలు వ్యక్తం చేసినా, వాటిని సీఈసీ పట్టించుకోలేదని వచ్చిన మీడియా కథనాలను రాహుల్ గాంధీ ప్రస్తావించారు. (మిగతా 2వ పేజీలో..)



తెలంగాణలో నేడు, రేపు కుండపోత.. పలు జిల్లాలకు రెడ్ అలెర్ట్

5 జిల్లాలకు రెడ్, 8 జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్ జారీ

నిన్న పలు జిల్లాల్లో ఓ మోస్తరు నుంచి భారీ వర్షాలు

పిడుగుపాటుకు వేర్వేరు చోట్ల ముగ్గురు మహిళల మృతి

భద్రాద్రి జిల్లాలో పాఠశాలలకు రెండు రోజులు సెలవులు

తెలంగాణలో నేడు, రేపు (గురు, శుక్రవారాలు) అతి భారీ నుంచి అత్యంత భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం హెచ్చరించింది. బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం ప్రభావంతో రాష్ట్రవ్యాప్తంగా వర్షాలు

(మిగతా 2వ పేజీలో..)



ప్రజాస్వామ్యాన్ని కాపాడాల్సిన ఎన్నికల సంఘమే నిరంకుశంగా మారుతున్నది : కేటీఆర్



హైదరాబాద్: ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్యంగా చెప్పుకునే మన దేశంలో ప్రజాస్వామ్యాన్ని కాపాడాల్సిన ఎన్నికల సంఘం తీరు దాదాపు నియంతృత్వ ధోరణిలోకి వెళ్తున్నదని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆందోళన వ్యక్తం చేశారు.స్థానిక సేవలను పొందండి ముగ్గురు ఎన్నికల కమిషనర్లలో ఇద్దరు పదేపదే అభ్యంతరాలు వ్యక్తం చేస్తున్నప్పుడు, ఎన్నికల సంఘం పనితీరును సరిదిద్దాల్సిన అవసరం ఉందని ఆయన అన్నారు. ముగ్గురిలో ఇద్దరు ఒక నిర్ణయానికి వ్యతిరేకంగా ఉన్నప్పుడు అది మెజారిటీ కాదా? ఇప్పటివరకు మెజారిటీ అంటే ఇదే కదా. ఇప్పుడు దాని నిర్వచనం కూడా మారుతున్నట్టుందని పేర్కొన్నారు. ఓటర్ల నమోదు, తొలగింపు, తొలగించిన ఓట్లను తిరిగి చేర్చడం వంటి అంశాల్లో సందేహాలకు తావిచ్చేలా నిర్ణయాలు తీసుకుంటే, 'అసలు మనం ఇంకా ప్రజాస్వామ్యం లోనే ఉన్నామా? అంటూ అనుమానం వ్యక్తం చేశారు. దేశ భవిష్యత్తును ప్రజాస్వామ్య పరిరక్షణ బాధ్యత ఉన్న సంస్థ పునాదులే బలహీనపడుతున్న పరిస్థితిలో దాని నిర్ణయాలకు వదిలేయలేమని అన్నారు. ప్రజాస్వామ్యాన్ని కాపాడేందుకు రాజకీయ పార్టీలు, రాజ్యాంగ సంస్థలు, పౌర సంఘాలు, ముఖ్యంగా సుప్రీంకోర్టు కలిసి ముందుకు రావాలని ఆయన ఆకాంక్షించారు. తెలంగాణలో ఓట్ల తొలగింపుపైనా కేటీఆర్ తీవ్రంగా స్పందించారు. ' తెలంగాణలో అత్యధిక ఓట్ల తొలగింపులు బీఆర్ఎస్ గెలిచిన స్థానాల్లోనే ఉండటం ఆశ్చర్యం కలిగించలేద' అని అన్నారు.తెలంగాణలో ప్రస్తుతం ఒకే పోరాటం జరుగుతున్నదని, అది ' కేసీఆర్ వర్సెస్ అందరూ' అని కేటీఆర్ పేర్కొన్నారు. బీఆర్ఎస్‌ను ఓడించేందుకు కాంగ్రెస్, బీజేపీలు కలిసి అనైతిక, అక్రమ, బహిరంగంగా ప్రకటించని కుమ్మక్కుకు పాల్పడ్డాయని ఆరోపించారు. ఇప్పుడు ఆ కుమ్మక్కులోకి ఎన్నికల సంఘం కూడా చేరుతున్నట్టుగా కనిపిస్తున్నదని వ్యాఖ్యానించారు. ఈ వ్యవహారంపై బీఆర్ఎస్ న్యాయస్థానాల్లోనూ, ప్రజల మధ్యనూ పోరాడుతుందని స్పష్టం చేశారు. చట్టవిరుద్ధంగా తొలగించిన ప్రతి ఓటును తిరిగి చేర్పిస్తామని ప్రకటించారు. చివరగా ఆయన తన రాజకీయ సందేశాన్ని మరోసారి స్పష్టం చేస్తూ తెలంగాణలో ఒకే ఒక్క 'సార్' ఉన్నారు. అది కేసీఆర్ సార్. ప్రజలకు ఆయనపై ఉన్న ప్రేమను ఏ 'ఎస్ఐఆర్' కూడా ఓడించలేదు' అని అన్నారు.

మహేశ్ గౌడ్, అద్దంకి దయాకర్ లపై పరువునష్టం పిటిషన్లను కోర్టు స్వీకరించింది: హరీశ్ రావు

తాను క్షుద్ర పూజలు చేశానంటూ తప్పుడు ప్రచారం చేశారంటూ హరీశ్ మండిపాటు

ప్రజా సమస్యల నుంచి ప్రజల దృష్టి మళ్లించేందుకే ఇలాంటి నిందలు వేస్తున్నారని విమర్శ

ఇప్పటి వరకు డిప్యూటీ స్పీకర్ నియామకం చేపట్టకపోవడం దారుణమని వ్యాఖ్య



తాను క్షుద్ర పూజలు చేశానంటూ తప్పుడు ప్రచారం చేసిన పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్, ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్‌లపై ఆధారాలతో క్రిమినల్ పరువు నష్టం పిటిషన్

(మిగతా 2వ పేజీలో..)

కాక్రోచ్ పార్టీ 48 గంటల అల్టిమేటం.. సీఈసీ జ్ఞానేశ్ కుమార్‌పై పెరుగుతున్న ఒత్తిడి

ఈసీలో విభేదాల వ్యవహారంతో రాజకీయ దుమారం

సీఈసీ జ్ఞానేశ్ కుమార్ రాజీనామాకు సీజేపీ 48 గంటల గడువు

రాజీనామా చేయకపోతే దేశవ్యాప్త ఆందోళన చేపడతామని హెచ్చరిక

రానున్న అసెంబ్లీ ఎన్నికలను నిలిపివేయాలని డిమాండ్

ఇప్పటికే విపక్షాల విమర్శల నేపథ్యంలో పెరిగిన ప్రాధాన్యం

కేంద్ర ఎన్నికల సంఘంలో కమిషనర్ల మధ్య విభేదాల వ్యవహారం రాజకీయంగా తీవ్ర దుమారం రేపుతోంది. ఎస్ఐఆర్ సహా ఎన్నికల సంఘం తీసుకున్న పలు నిర్ణయాలపై ఇద్దరు ఎన్నికల కమిషనర్లు అభ్యంతరాలు వ్యక్తం చేశారంటూ ఇండియన్ ఎక్స్‌ప్రెస్ కథనం ప్రచురించింది. గత పది నెలల్లో కనీసం 14 సందర్భాల్లో సుఖ్‌బీర్ సింగ్ సంధు, వివేక్ జోషి అభ్యంతరాలు నమోదు చేసినట్లు ఆ కథనం పేర్కొంది. దీంతో



ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్‌పై విపక్షాల విమర్శలు మరింత పెరిగాయి.ఇప్పటికే కాంగ్రెస్ సహా పలు విపక్ష పార్టీలు జ్ఞానేశ్ కుమార్ పదవి నుంచి తప్పుకోవాలని డిమాండ్ చేస్తున్నాయి. తాజాగా కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) కూడా రంగంలోకి దిగింది. జ్ఞానేశ్ కుమార్ 48 గంటల్లో రాజీనామా చేయాలని సీజేపీ వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే అల్టిమేటం ఇచ్చారు. (మిగతా 2వ పేజీలో..)



సం పా ద కీ యం

చెత్త నిర్వహణలో మార్పు..

పరిశుభ్రతే ఆరోగ్యానికి పునాది

పట్టణాలు, గ్రామాలు వేగంగా విస్తరిస్తున్న కొద్దీ చెత్త సమస్య కూడా అంతే వేగంగా పెరుగుతోంది. జనాభా పెరుగుదల, వినియోగ సంస్కృతి, ప్లాస్టిక్ వినియోగం, ప్యాకేజింగ్ పదార్థాల పెరుగుదల కారణంగా ప్రతిరోజూ భారీగా వ్యర్థాలు ఉత్పత్తి అవుతున్నాయి. కానీ వాటిని సక్రమంగా సేకరించడం, వేరు చేయడం, శుద్ధి చేయడం, పునర్వినియోగం చేయడం వంటి ప్రక్రియలు చాలా ప్రాంతాల్లో ఆశించిన స్థాయిలో జరగడం లేదు. ఫలితంగా రోడ్ల పక్కన చెత్త కుప్పలు, కాలువల్లో వ్యర్థాలు, ఖాళీ స్థలాల్లో చెత్త పారబోయడం సాధారణ దృశ్యాలుగా మారుతున్నాయి.

పరిశుభ్రత అనేది కేవలం అందానికి సంబంధించిన విషయం కాదు. అది ప్రజారోగ్యంతో నేరుగా ముడిపడి ఉంటుంది. చెత్త సకాలంలో తొలగించకపోతే దోమలు, ఈగలు, ఇతర కీటకాలు పెరిగి వ్యాధులు వ్యాప్తి చెందే అవకాశం ఉంటుంది. ప్లాస్టిక్, ఇతర వ్యర్థాలు కాలువల్లో పేరుకుపోతే వర్షాకాలంలో నీటి పారుదల సమస్యలు మరింత తీవ్రమవుతాయి. చెత్తను బహిరంగంగా కాల్చడం వల్ల వాయు కాలుష్యం పెరుగుతుంది. అంటే చెత్త నిర్వహణలో నిర్లక్ష్యం పర్యావరణంతో పాటు ప్రజల ఆరోగ్యానికీ ముప్పుగా మారుతుంది.

ఇంటి నుంచే మార్పు మొదలు కావాలి

చెత్త సమస్యను పూర్తిగా అధికార యంత్రాంగం బాధ్యతగా చూడటం సరైంది కాదు. ప్రతి ఇంటి నుంచే మార్పు ప్రారంభం కావాలి. తడి చెత్త, పొడి చెత్త, ప్రమాదకర వ్యర్థాలను వేరు చేసి ఇవ్వడం వంటి చిన్న చర్యలే పెద్ద మార్పుకు దారితీస్తాయి. వంటింటి వ్యర్థాలను కంపోస్టింగ్ ద్వారా ఎరువుగా మార్చుకోవచ్చు. ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించి పునర్వినియోగించగల వస్తువులను ఉపయోగించడం ద్వారా చెత్త పరిమాణాన్ని గణనీయంగా తగ్గించవచ్చు.

ఇది ఒకరోజు చేయాల్సిన కార్యక్రమం కాదు. అలవాటుగా మారాల్సిన జీవన విధానం. ఇంట్లో చెత్తను వేరు చేసి బయటకు ఇచ్చే అలవాటు పెరిగితే మున్సిపాలిటీలు, గ్రామపంచాయతీలకు కూడా వ్యర్థాల నిర్వహణ సులభమవుతుంది.

సేకరణలోనే కాదు.. శుద్ధిలోనూ నాణ్యత అవసరం

చెత్తను సేకరించి ఒక చోట పడేయడం మాత్రమే వ్యర్థ నిర్వహణ కాదు. సేకరించిన తర్వాత దాని శాస్త్రీయ నిర్వహణ అత్యవసరం. తడి వ్యర్థాలతో కంపోస్ట్, పొడి వ్యర్థాల్లో పునర్వినియోగ పదార్థాలను వేరు చేయడం, మిగిలిన వాటిని శాస్త్రీయ పద్ధతిలో నిర్మూలించడం వంటి చర్యలు చేపట్టాలి.

ప్రతి పట్టణంలో రోజువారీ చెత్త ఉత్పత్తి ఎంత? దానికి అనుగుణంగా ప్రాసెసింగ్ సామర్థ్యం ఎంత? ప్రస్తుతం ఉన్న మౌలిక వసతులు ఎంతవరకు పనిచేస్తున్నాయి? అనే అంశాలపై స్థానిక సంస్థలు ఎప్పటికప్పుడు సమీక్ష చేయాలి. కేవలం వాహనాలతో చెత్త తరలించడం కాకుండా చివరి దశ వరకు పర్యవేక్షణ ఉండాలి.

ప్లాస్టిక్‌కు ప్రత్యామ్నాయాలు అవసరం

ప్లాస్టిక్ వ్యర్థాలు పర్యావరణానికి పెద్ద సవాలుగా మారుతున్నాయి. ఒక్కసారి ఉపయోగించే ప్లాస్టిక్ వస్తువుల వినియోగాన్ని తగ్గించడం ప్రతి ఒక్కరి బాధ్యత. దుకాణాలకు వెళ్లేటప్పుడు బట్ట సంచులు తీసుకెళ్లడం, నీటి సీసాలను పదేపదే వినియోగించడం, అధిక ప్యాకేజింగ్ ఉన్న వస్తువుల వినియోగాన్ని తగ్గించడం వంటి చర్యలు చిన్నవిగా కనిపించినా ప్రభావం పెద్దదే.

అదే సమయంలో ప్రత్యామ్నాయ ప్యాకేజింగ్ పదార్థాలను అందుబాటులోకి తీసుకురావాల్సిన బాధ్యత వ్యాపార సంస్థలపై కూడా ఉంది. వినియోగదారులకు ఎంపికలు ఉన్నప్పుడే మార్పు వేగంగా జరుగుతుంది.

పాఠశాలల నుంచే అవగాహన

పరిశుభ్రతపై అవగాహన చిన్ననాటి నుంచే పెంచాలి. పాఠశాలల్లో చెత్త వేరు చేయడం, ప్లాస్టిక్ వినియోగం తగ్గించడం, నీటి సంరక్షణ, పరిసరాల పరిశుభ్రత వంటి అంశాలను ఆచరణాత్మకంగా బోధించాలి. విద్యార్థులు నేర్చుకున్న అలవాట్లు కుటుంబాలకు కూడా చేరతాయి. పాఠశాల స్థాయిలో చిన్నచిన్న కార్యక్రమాల ద్వారా పెద్ద సామాజిక మార్పుకు పునాది వేయవచ్చు.

ప్రజల భాగస్వామ్యమే విజయానికి కీలకం

పరిశుభ్రమైన పరిసరాల కోసం ప్రభుత్వ సంస్థలు ఎన్ని చర్యలు చేపట్టినా ప్రజల సహకారం లేకుండా పూర్తి ఫలితం సాధ్యం కాదు. అదే సమయంలో ప్రజలకు బాధ్యతలు చెప్పే ముందు స్థానిక సంస్థలు కూడా తమ సేవలను సమర్థవంతంగా అందించాలి. చెత్త సేకరణ సమయాలు, ప్రత్యేక సేకరణ కేంద్రాలు, ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ వంటి అంశాల్లో స్పష్టత ఉండాలి.

రోడ్డుపై చెత్త వేయకూడదని చెప్పడం ఎంత ముఖ్యమో.. చెత్త వేయడానికి సరైన సదుపాయాలు కల్పించడం కూడా అంతే ముఖ్యం. జరిమానాల కంటే అవగాహన, సదుపాయాలు, నిరంతర పర్యవేక్షణ కలగలిసి పనిచేసినప్పుడే మంచి ఫలితం వస్తుంది. పరిశుభ్రత అనేది ఒక శాఖ పని కాదు.. సమాజం మొత్తం బాధ్యత. ఇంటి ముందు మాత్రమే కాదు, మన వీధి, మన కాలనీ, మన గ్రామం, మన పట్టణం పరిశుభ్రంగా ఉండాలని ప్రతి ఒక్కరూ ఆలోచించినప్పుడే నిజమైన మార్పు వస్తుంది. చెత్తను సమస్యగా చూసే దశ నుంచి.. వ్యర్థాన్ని వనరుగా మార్చే దిశగా అడుగులు వేయాల్సిన సమయం వచ్చింది. పరిశుభ్రమైన సమాజమే ఆరోగ్యకరమైన భవిష్యత్తుకు బలమైన పునాది.

మహేశ్ గౌడ్, అద్దంకి దయాకర్ లపై పరువునష్టం పిటిషన్లను కోర్టు స్వీకరించింది: హరీశ్ రావు

మొదటి పేజీ తరువాయి)

దాఖలు చేయగా, కోర్టు విచారణకు స్వీకరించిందని మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత హరీశ్ రావు తెలిపారు తెలిపారు. ఈ విషయంలో సెప్టెంబర్ 30న తన స్టేట్‌మెంట్ రికార్డు చేసేందుకు కోర్టు అనుమతించిందని వెల్లడించారు. నాంపల్లి కోర్టు వద్ద మీడియాతో మాట్లాడుతూ ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు.ఎన్నికల ముందు కాంగ్రెస్ ఇచ్చిన ఆరు గ్యారంటీల అమలు, ప్రజా సమస్యల నుంచి ప్రజల దృష్టిని మళ్లించడానికే తమపై ఈ తరహా నీచమైన నిందలు వేస్తున్నారని హరీశ్ ఆరోపించారు. అధికారంలోకి వచ్చి ఇన్నాళ్లైనా అసెంబ్లీ డిప్యూటీ స్పీకర్ నియామకం చేపట్టకపోవడం దారుణమని అన్నారు. సభా హక్కుల ఉల్లంఘన నోటీసులను కూడా స్పీకర్ పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. ఎమ్మెల్యే దానం నాగేందర్ అనర్హత వ్యవహారంలో సుప్రీంకోర్టు వెలువరించిన ఆదేశాలు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి చెంపపెట్టు లాంటివని అభివర్ణించారు. లోక్‌సభలో రాజ్యాంగ సంరక్షకుడిగా మాట్లాడే రాహుల్ గాంధీ, తెలంగాణలో పార్టీ మారిన ఎమ్మెల్యేలతో తక్షణమే రాజీనామాలు చేయించాలని డిమాండ్ చేశారు. ఫిరాయింపులకు పాల్పడిన ఎమ్మెల్యేలను కాపాడేందుకు స్పీకర్ ప్రయత్నించారని, అయితే పార్టీ మారిన ఎమ్మెల్యేలందరికీ సుప్రీంకోర్టు తీర్పుతో అనర్హత వేటు తప్పదని స్పష్టం చేశారు. ఇప్పటికైనా ఫిరాయింపు నేతలు రాజీనామాలు చేసి ప్రజా తీర్పును కోరాలని హరీశ్ రావు డిమాండ్ చేశారు.

జ్ఞానేశ్ కుమార్ దేశద్రోహి.. తక్షణమే దిగిపోవాలి: రాహుల్ గాంధీ డిమాండ్

మొదటి పేజీ తరువాయి)

ఎన్నికల సంఘంలో ఈ అంతర్గత విభేదాలే తన ఆరోపణలకు బలమైన ఆధారమని ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా రాహుల్ గాంధీ మాట్లాడుతూ.. “అబ్‌కీ బార్ 400 పార్” అని, దశాబ్దాల పాటు అధికారంలో ఉంటామని మోదీ, అమిత్ షాలు గతంలో ఎంతో ధీమాగా చెప్పారని గుర్తుచేశారు. ప్రజాస్వామ్యంలో ప్రభుత్వ వ్యతిరేకత సర్వసాధారణమని, అలాంటిది బీజేపీకి మాత్రం ఎలా వర్తించడం లేదని ఆయన ప్రశ్నించారు. “1971 యుద్ధంలో దేశానికి ఘన విజయం అందించిన ఇందిరా గాంధీ వంటి నేత కూడా ప్రభుత్వ వ్యతిరేకతను ఎదుర్కొన్నారు. హర్యానా, మహారాష్ట్ర, ఉత్తరప్రదేశ్ వంటి రాష్ట్రాల్లో బీజేపీకి వ్యతిరేకంగా వ్యతిరేక పవనాలు ఉన్నా, అవి అకస్మాత్తుగా ఎలా మాయమయ్యాయి?” అని రాహుల్ నిలదీశారు. దీనికి కారణం ‘ఓట్ల దొంగతనం’ జరగడమేనని తమ పార్టీ ఒక నిర్ధారణకు వచ్చిందని ఆయన అన్నారు. “ఓట్లను దొంగిలిస్తే రాజ్యాంగానికి పునాదులే ఉండవు. దొంగిలించబడిన ఓట్లతో గెలిచిన ప్రజాప్రతినిధులు చేసే చట్టాలు కూడా చట్టవిరుద్ధమే అవుతాయి. దీనిని ‘చట్టాల దొంగతనం’ అంటారు. దాని ఫలితంగా సంస్థాగత మార్పులు కూడా అక్రమమే అవుతాయి” అని రాహుల్ వివరించారు. ఈ ప్రక్రియకు బాధ్యులైన మోదీ, షా, జ్ఞానేశ్ కుమార్‌లను దేశద్రోహులుగా అభివర్ణించారు. గతంలో జరిగిన లోక్‌సభ, పలు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల్లో రిగ్గింగ్ జరిగిందని, దీనిపై మోదీ, షాలపై భవిష్యత్తులో తప్పకుండా విచారణ జరుగుతుందని ఆయన జోస్యం చెప్పారు. సీఈసీ జ్ఞానేశ్ కుమార్‌ను ఉద్దేశించి రాహుల్ మాట్లాడుతూ, “మీరు చేసింది దేశద్రోహంతో సమానం. ఇది రాజ్యాంగంపై, దేశ చట్టాలపై జరిగిన దాడి. ఓటును కాపాడాల్సిన మీరే ఇలా చేశారు. ఇప్పటికైనా రాజీనామా చేసి, దేశ ప్రయోజనాల దృష్ట్యా అప్రూవర్‌గా మారండి” అని హితవు పలికారు. నిజాయతీగా అభ్యంతరాలు వ్యక్తం చేసిన ఇద్దరు కమిషనర్లను ఆయన అభినందించారు. దేశంలో ఎన్నికల వ్యవస్థ పూర్తిగా దెబ్బతిందని, దీనిని నిరూపించడానికి తమ వద్ద తగినంత సమాచారం ఉందని ఆయన స్పష్టం చేశారు. ఈ కుట్రకు బాధ్యులైన వారికి ఏదో ఒక రోజు తప్పకుండా శిక్ష పడుతుందని రాహుల్ గాంధీ హెచ్చరించారు. కాగా, ఈ ఆరోపణలపై ఎన్నికల సంఘం గతంలోనే స్పందించింది. కమిషనర్ల మధ్య చర్చలు, అభిప్రాయ భేదాలు పరిపాలనలో సాధారణ ప్రక్రియ అని, తుది నిర్ణయాలన్నీ ఏకగ్రీవంగానే తీసుకున్నామని స్పష్టం చేసింది. అయినప్పటికీ, రాహుల్ చేసిన తాజా ఆరోపణలతో ఈ వివాదం మరింత ముదిరినట్టయింది.

తెలంగాణలో నేడు, రేపు కుండపోత.. పలు జిల్లాలకు రెడ్ అలెర్ట్

మొదటి పేజీ తరువాయి)

కురుస్తున్నాయి. ఈ నేపథ్యంలో వాతావరణ శాఖ 5 జిల్లాలకు రెడ్ అలర్ట్, 8 జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్ జారీ చేసింది. ఆసిఫాబాద్, మంచిర్యాల, భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లో అత్యంత భారీ వర్షాలు పడతాయని అంచనా వేస్తూ రెడ్ అలర్ట్ ప్రకటించింది. ఆదిలాబాద్, జగిత్యాల, కరీంనగర్, పెద్దపల్లి, ఖమ్మం, మహబూబాబాద్, వరంగల్, హనుమకొండ జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్ జారీ చేసింది. మిగతా జిల్లాలకు ఎల్లో అలర్ట్ కొనసాగుతోంది.బుధవారం రాష్ట్రంలోని చాలా ప్రాంతాల్లో ఓ మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిశాయి. ఉమ్మడి ఖమ్మం, మహబూబ్‌నగర్, నల్గొండ జిల్లాల్లో రోజంతా ముసురు పట్టింది. ఖమ్మం జిల్లా కల్లూరులో అత్యధికంగా 6.28 సెం.మీ వర్షపాతం నమోదైంది. రెడ్ అలర్ట్ జారీ చేయడంతో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్ ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలకు రెండు రోజులు సెలవులు ప్రకటించారు. ఇదే జిల్లా బూర్గంపాడు మండలంలో గాలిదుమారం బీభత్సం సృష్టించింది. పలు ఇళ్ల పైకప్పులు, హోర్డింగులు ఎగిరిపడ్డాయి. ఈ వర్షాల కారణంగా విషాదకర ఘటనలు కూడా చోటుచేసుకున్నాయి. వేర్వేరు ప్రాంతాల్లో పిడుగులు పడి ముగ్గురు మహిళా కూలీలు ప్రాణాలు కోల్పోయారు. మహబూబ్‌నగర్ జిల్లా పెబ్బేరులో లక్ష్మి (35), జడ్చర్లలో యాదమ్మ (66), పెద్దపల్లి జిల్లా జూలపల్లిలో అంజమ్మ (55) మృతి చెందారు. పిడుగుపాటు వల్ల మరికొందరు గాయపడగా, పశువులు కూడా మృత్యువాత పడ్డాయి.

కాక్రోచ్ పార్టీ 48 గంటల అల్టిమేటం.. సీఈసీ జ్ఞానేశ్ కుమార్‌పై పెరుగుతున్న ఒత్తిడి

మొదటి పేజీ తరువాయి)

గడువులోగా రాజీనామా చేయకపోతే ఢిల్లీతో పాటు దేశవ్యాప్తంగా నిరసనలు చేపడతామని ప్రకటించారు.ఈ క్రమంలో, సీజేపీ సహ కన్వీనర్ సౌరవ్ దాస్ తమ డిమాండ్లను వెల్లడించారు. సీఈసీ జ్ఞానేశ్ కుమార్ రాజీనామాతో పాటు ఆయనకు ఆదేశాలు ఇచ్చినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న వారిపై క్రిమినల్ చర్యలు తీసుకోవాలని కోరారు. రానున్న అసెంబ్లీ ఎన్నికలను నిలిపివేయాలని డిమాండ్ చేశారు. ఓటర్ల జాబితాలను 2025 నాటి స్థాయికి పునరుద్ధరించాలని కోరారు. ఎస్ఐఆర్‌కు సంబంధించిన ఫైళ్లను సుప్రీంకోర్టు నేతృత్వంలోని కమిటీ అధీనంలో ఉంచాలన్నారు. ఎన్నికల కమిషనర్ల నియామకానికి సంబంధించిన ప్రస్తుత చట్టాన్ని రద్దు చేయాలని కూడా డిమాండ్ చేశారు.గతంలో నీట్ పేపర్ లీక్ వ్యవహారం, అప్పటి కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌కు వ్యతిరేకంగా కూడా సీజేపీ ఇలాంటి ఆందోళనలు చేపట్టిన విషయం తెలిసిందే. చివరకు కేంద్ర ప్రభుత్వం దిగొచ్చి వారి డిమాండ్లను నెరవేర్చింది. తాజాగా ఎన్నికల సంఘంపై ఆందోళనకు పిలుపునివ్వడం రాజకీయ వర్గాల్లో చర్చకు దారితీసింది.ఇక పశ్చిమ బెంగాల్ మాజీ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ సైతం జ్ఞానేశ్ కుమార్‌పై తీవ్ర ఆరోపణలు చేశారు. ఆయనను అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. ఎస్ఐఆర్‌కు ముందు ఉన్న ఓటర్ల జాబితా ఆధారంగా పశ్చిమ బెంగాల్‌లో తాజా అసెంబ్లీ ఎన్నికలు నిర్వహించాలని కోరారు. ఈ అంశంపై దేశవ్యాప్తంగా విపక్షాలు కలిసి పోరాడాలని పిలుపునిచ్చారు.కాంగ్రెస్ కూడా సీఈసీ రాజీనామా డిమాండ్‌ను ముందుకు తీసుకెళ్లింది. పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, ఇతర నేతలు ఎన్నికల సంఘం పనితీరుపై ప్రశ్నలు లేవనెత్తారు. ఎన్నికల ప్రక్రియపై ఇప్పటికే తాము వ్యక్తం చేసిన అభ్యంతరాలకు తాజా ఇండియన్ ఎక్స్‌ప్రెస్ కథనం బలం చేకూర్చుతోందని కాంగ్రెస్ నేతలు పేర్కొన్నారు.సమాజ్‌వాదీ పార్టీ అధినేత అఖిలేశ్ యాదవ్ కూడా స్పందించారు. జ్ఞానేశ్ కుమార్ హయాంలో ఇకపై ఎన్నికలు నిర్వహించకూడదనిడిమాండ్ చేశారు. ఎన్నికల సంఘంలోనే నిర్ణయాలపై అభ్యంతరాలు నమోదైనట్లు వచ్చిన సమాచారం ఆందోళన కలిగించే అంశమని పేర్కొన్నారు.శివసేన (యూబీటీ) అధినేత ఉద్ధవ్ ఠాక్రే మరింత తీవ్రంగా స్పందించారు. జ్ఞానేశ్ కుమార్‌ను పదవి నుంచి తొలగించడంతో పాటు జైలుకు పంపాలని డిమాండ్ చేశారు. ఎన్నికల కమిషనర్లు నమోదు చేసిన అభ్యంతరాలపై సమగ్ర విచారణ జరగాలని కోరారు.మరోవైపు ఎన్నికల సంఘం మాత్రం ఈ ఆరోపణలను ఖండించింది. కమిషనర్ల మధ్య భిన్నాభిప్రాయాలు, రాతపూర్వక అభిప్రాయాలు నమోదు కావడం అంతర్గత చర్చల్లో సాధారణమేనని స్పష్టం చేసింది. ఎస్ఐఆర్‌తో పాటు గత ఏడాది తీసుకున్న నిర్ణయాలన్నీ ఏకగ్రీవంగానే తీసుకున్నామని ఎన్నికల సంఘం తెలిపింది.ఇదే సమయంలో బీజేపీ విపక్షాల విమర్శలను తప్పుబట్టింది. ఎన్నికల కమిషనర్ల మధ్య చర్చలు, భిన్నాభిప్రాయాలు వ్యక్తం కావడం ప్రజాస్వామ్య వ్యవస్థలో సహజమేనని బీజేపీ నేతలు పేర్కొన్నారు. ఎస్ఐఆర్ విషయంలో తుది నిర్ణయాలు ఏకాభిప్రాయంతోనే తీసుకున్నామని చెప్పారు.దీంతో సీఈసీపై విపక్షాల విమర్శలు ఒకవైపు, ఎన్నికల సంఘం వివరణ మరోవైపు కొనసాగుతున్నాయి. ఇప్పుడు సీజేపీ ఇచ్చిన 48 గంటల గడువు ఈ వ్యవహారానికి కొత్త మలుపు తీసుకొచ్చింది. గడువు పూర్తయ్యాక సీజేపీ ఎలాంటి కార్యాచరణ చేపడుతుంది? ఇతర విపక్ష పార్టీలు దానికి మద్దతు ఇస్తాయా? దేశవ్యాప్త ఆందోళనలకు ఈ అంశం దారితీస్తుందా? అనేది ఇప్పుడు రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది.

హైదరాబాద్ గణేశ్ బందోబస్తు విధుల్లో ఎస్సై దుర్మరణం.. నిందితుడి కోసం పోలీసుల గాలింపు

గణేశ్ నిమజ్జన బందోబస్తు విధుల్లో ఎస్సై వెంకన్న మృతి
హైదరాబాద్‌లో గుర్తుతెలియని ద్విచక్ర వాహనం ఢీకొట్టడంతో ఘటన
ప్రమాదం తర్వాత స్వగ్రామానికి వెళ్లగా ఆరోగ్యం క్షీణించి కన్నుమూత
కుటుంబానికి అండగా ఉంటామని పోలీస్ కమిషనర్ సజ్జనార్ హామీ
పరారీలో ఉన్న నిందితుడి కోసం సైఫాబాద్ పోలీసుల గాలింపు

భాగ్యనగర గణేశ్ నిమజ్జన బందోబస్తు విధుల్లో తీవ్ర విషాదం చోటుచేసుకుంది. హైదరాబాద్‌లో గుర్తుతెలియని వాహనం ఢీకొని తీవ్రంగా గాయపడిన ఓ సబ్-ఇన్‌స్పెక్టర్ (ఎస్సై) చికిత్స పొందుతూ మృతిచెందారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా టూటౌన్ ఠాణాలో ఎస్సైగా పనిచేస్తున్న కె. వెంకన్న (57) ఈ దుర్ఘటనలో ప్రాణాలు కోల్పోయారు. వరంగల్ జిల్లాకు చెందిన ఆయన, గణేశ్ నిమజ్జన బందోబస్తు కోసం ప్రత్యేకంగా హైదరాబాద్‌కు వచ్చారు.వివరాల్లోకి వెళితే, ఎన్టీఆర్ గార్డెన్ ఫుట్‌ఓవర్ బ్రిడ్జి వద్ద ఎస్సై వెంకన్నకు విధులు కేటాయించారు. మంగళవారం అర్ధరాత్రి దాటిన తర్వాత సుమారు 2 గంటల సమయంలో, సచివాలయం వైపు నుంచి అంబేద్కర్ విగ్రహం వైపు వేగంగా, నిర్లక్ష్యంగా వస్తున్న ఓ ద్విచక్ర వాహనదారుడు వెంకన్నను బలంగా ఢీకొట్టాడు. ఈ ఘటనలో ఎస్సై రోడ్డుపై పడిపోగా తల, కుడి మోకాలు, కుడి చేతికి తీవ్ర గాయాలయ్యాయి. ప్రమాదానికి కారణమైన వ్యక్తి వాహనంతో సహా అక్కడి నుంచి పరారయ్యాడు.ప్రమాదం అనంతరం, వెంకన్నను లక్డీకాపూల్‌లోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించి ప్రథమ చికిత్స అందించారు. కాస్త కోలుకున్న తర్వాత ఆయన సైఫాబాద్ పోలీస్ స్టేషన్‌కు వెళ్లి ఘటనపై ఫిర్యాదు చేసి, అనంతరం తన స్వగ్రామమైన కిష్టాపురానికి బయలుదేరారు. అయితే, గ్రామానికి చేరుకున్నాక మధ్యాహ్నం తర్వాత ఆయన ఆరోగ్యం ఒక్కసారిగా క్షీణించింది. కుటుంబ సభ్యులు వెంటనే స్థానిక ఆసుపత్రికి తరలించగా, తలలో తీవ్ర రక్తస్రావం జరిగినట్లు వైద్యులు నిర్ధారించారు. అక్కడ చికిత్స పొందుతూ వెంకన్న కన్నుమూశారు. ఈ ఘటనపై సైఫాబాద్ పోలీసులు కేసు నమోదు చేసి, పరారీలో ఉన్న నిందితుడి కోసం ముమ్మరంగా గాలిస్తున్నారు.

ఎస్సై మృతిపై సీపీ సజ్జనార్ తీవ్ర విచారం



ఎస్సై వెంకన్న మృతి పట్ల హైదరాబాద్ నగర పోలీస్ కమిషనర్ వీసీ సజ్జనార్ తీవ్ర దిగ్భ్రాంతి, విచారం వ్యక్తం చేశారు. “గణేశ్ నిమజ్జన బందోబస్తులో భాగంగా విధి నిర్వహణలో ఉన్న వెంకన్నగారు గుర్తుతెలియని వాహనం ఢీకొని మరణించడం అత్యంత బాధాకరం, దురదృష్టకరం. ప్రజల భద్రత కోసం పనిచేస్తూ ఆయన ప్రాణాలు కోల్పోవడం తెలంగాణ పోలీసు శాఖకు తీరని లోటు” అని అన్నారు. ఈ విషాద సమయంలో వెంకన్న కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపిన కమిషనర్, ఆ కుటుంబానికి శాఖాపరంగా అన్ని విధాలా అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఈ ఘాతుకానికి పాల్పడిన నిందితుడిని త్వరలోనే పట్టుకొని చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన స్పష్టం చేశారు.

విజయ కెరటం
తెలుగు దినపత్రిక

ఆరో వార్డులో ఘనంగా గణేష్ నిమజ్జన శోభాయాత్ర









నల్లగొండ: సెప్టెంబర్ 24 విజయ కెరటం ప్రతినిధి

గణేష్ నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా నల్లగొండ జిల్లా కేంద్రంలోని ఆరో వార్డు శాంతినగర్ కురోళ్ల బావి వద్ద ఏర్పాటు చేసిన గణేష్ మండపం నుంచి నిమజ్జన శోభాయాత్రను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కాలనీ మహిళలు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని గణనాథుడికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.అనంతరం గణేష్ విగ్రహాన్ని శోభాయాత్రగా తీసుకెళ్లారు. మహిళలు కోలాటాలు, భజనలతో సందడి చేయగా, భక్తులు భక్తిశ్రద్ధలతో పాల్గొన్నారు. దీంతో శాంతినగర్ ప్రాంతంలో పండుగ వాతావరణం నెలకొంది.

వివాహ వేడుకకు హాజరైన తండు సైదులు గౌడ్





తిప్పర్తి 24 సెప్టెంబర్ విజయకేరటం ప్రతినిధి:

కాశీవారిగూడెం గ్రామానికి చెందిన బీఆర్ఎస్ నాయకుడు లతీఫ్ కుమారుడు ఇబ్రహీం--ఫాతిమాల వివాహ వేడుకకు మాజీ తిప్పర్తి జెడ్పీటీసీ తండు సైదులు గౌడ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా నూతన వధూవరులను ఆశీర్వదించి, వివాహ శుభాకాంక్షలు తెలిపారు. మైనార్టీలకు అండగా ఎల్లప్పుడూ వెన్నంటి ఉంటానని ఆయన తెలిపారు ఇబ్రహీం--ఫాతిమాలు సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఆనందంగా జీవించాలని సైదులు గౌడ్ ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కాశీవారిగూడెం గ్రామ సర్పంచ్ షేక్ కమాల్, బీఆర్ఎస్ నాయకులు కరీం, మైనారిటీ అధ్యక్షుడు కలీమ్, పాషా, రంజాన్, సోహెల్, చంద్ పాషా, హుస్సేన్, కమల్ తదితరులు పాల్గొన్నారు.



గచ్చిబౌలి గృహ నిర్మాణ సహకార సంఘం డైరెక్టర్ కట్కూరి శ్రీకాంత్‌కు ఘన సన్మానం





హైదరాబాద్, సెప్టెంబర్ 24 విజయ కెరటం ప్రతినిధి

గచ్చిబౌలి టీఎన్‌జీవోస్ పరస్పర సహాయ సహకార గృహ నిర్మాణ సంఘం డైరెక్టర్‌గా ఎన్నికైన కట్కూరి శ్రీకాంత్‌ను వివిధ శాఖల ఉద్యోగులు ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు.హైదరాబాద్ అబిడ్స్‌లోని భీమా భవన్, తిలక్ రోడ్డులో నిర్వహించిన ఈ కార్యక్రమంలో పే అండ్ అకౌంట్స్ కార్యాలయ విభాగం అధ్యక్షుడు సంతోష్, కార్యదర్శి బాల నర్సింగ్ రావు, కోశాధికారి ఆదిత్య, దేవాదాయ శాఖ అధ్యక్షుడు బాబు, శంకర్, సందీప్, రాష్ట్ర ఆడిట్ శాఖకు చెందిన మహేష్, ఆనంద్, ఎన్‌సీసీ శాఖకు చెందిన దర్గా, రాజేష్ తదితరులు పాల్గొని శ్రీకాంత్‌ను అభినందించారు.అలాగే టీఎన్‌జీవోస్ యూనియన్ హైదరాబాద్ నగర శాఖ నాయకులు అమరేందర్, వరలక్ష్మి, ప్రభాకర్ రెడ్డి, అర్మని రాజు, విజయలక్ష్మి తదితరులు పాల్గొని శుభాకాంక్షలు తెలిపారు. ఎక్సైజ్ శాఖ నుంచి మహేందర్ రావు పటేల్, పే అండ్ అకౌంట్స్ కార్యాలయం నుంచి అశోక్, సైదులు, సులోచన, రూపతో పాటు జె.ఆర్. పవర్, కృష్ణ, శీను, క్రాంతికుమార్, శ్రీకాంత్, రమేష్, గౌరీశంకర్ తదితరులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా కట్కూరి శ్రీకాంత్ మాట్లాడుతూ తనపై విశ్వాసం ఉంచి డైరెక్టర్‌గా ఎన్నుకున్న గచ్చిబౌలి టీఎన్‌జీవోస్ పరస్పర సహాయ సహకార గృహ నిర్మాణ సంఘం సభ్యులందరికీ హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. సంఘం అభివృద్ధి, సభ్యుల సంక్షేమం, వారి హక్కుల పరిరక్షణ కోసం నిబద్ధతతో పనిచేస్తానని చెప్పారు. సభ్యుల సమస్యలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి వాటి పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. తన ఎన్నిక సందర్భంగా సన్మాన కార్యక్రమం నిర్వహించి, అభినందనలు, ఆశీస్సులు అందించిన వివిధ శాఖల

ఎంజీఎంపై మొసలి కన్నీరు ఆపండి!

పదేళ్లు ఏం చేశారు.. ఇప్పుడు హడావుడి ఎందుకు?

డీసీసీ అధ్యక్షుడు మహమ్మద్ అయూబ్ విమర్శ

వరంగల్, విజయ కెరటం సెప్టెంబర్ 24:




ఎంజీఎం ఆస్పత్రిపై బీఆర్ఎస్ నేతలు చేస్తున్న విమర్శలు రాజకీయ మొసలి కన్నీరేనని డీసీసీ అధ్యక్షుడు మహమ్మద్ అయూబ్ విమర్శించారు. పదేళ్లు అధికారంలో ఉండి ఆస్పత్రి అభివృద్ధిని పట్టించుకోని వారు ఇప్పుడు ఎంజీఎంపై ప్రేమ ఒలకబోస్తున్నారని ఎద్దేవా చేశారు. గురువారం జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు.బీఆర్ఎస్ హయాంలో ఎంజీఎంకు అవసరమైన మౌలిక వసతులు, వైద్య సదుపాయాలు కల్పించలేదని ఆరోపించారు. నూతన ఆస్పత్రి పేరుతో హడావుడి తప్ప పూర్తిస్థాయిలో సేవలు అందించే చర్యలు చేపట్టలేదన్నారు. కేసీఆర్ అసెంబ్లీకి వచ్చి ప్రజా సమస్యలపై ప్రభుత్వాన్ని ప్రశ్నించకుండా ఫామ్‌హౌస్ నుంచే రాజకీయాలు చేయడం ఏమిటని ప్రశ్నించారు. ఎంజీఎం సమస్యలపై చిత్తశుద్ధి ఉంటే అసెంబ్లీలో ప్రభుత్వాన్ని నిలదీయాలని సూచించారు.ఎంజీఎం ఘటనను రాజకీయ ప్రయోజనాలకు వాడుకోవద్దని, మాజీ ఎమ్మెల్యే దాస్యం వినయ్‌భాస్కర్ చేసిన పోలీసులపై ఆరోపణలపై విచారణ ద్వారా వాస్తవాలు తేలాలని అయూబ్ అన్నారు. ఆస్పత్రిలో మీడియాకు పారదర్శకంగా సమాచారం అందించాలని కోరారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎంజీఎం అభివృద్ధికి కట్టుబడి ఉందని స్పష్టం చేశారు.సమావేశంలో కాంగ్రెస్ నాయకుడు మొహమ్మద్ కమలుద్దీన్, 3వ డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షుడు జన్ను అరుణ్‌కర్, 14వ డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షుడు సయ్యద్ ఇంతియాజ్, 43వ డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షుడు మాడుగుల రాజుకుమార్ తదితరులు పాల్గొన్నారు.

రూ.5కే వైద్యం.. ప్రజల గుండెల్లో నారాయణ

ప్రజావైద్యుడి అమరత్వానికి 30 ఏళ్లు

వరంగల్ విజయ కెరటం సెప్టెంబర్ 24:



ఆయన కేవలం ఒక వైద్యుడు కాదు.. ముప్పై గ్రామాల ప్రజల గుండె చప్పుడు. రోగుల ముఖం చూసి వారి బాధను అర్థం చేసుకుని వైద్యం అందించిన నిస్వార్థ సేవకుడు డాక్టర్ అమెడ నారాయణ. ప్రజలే ప్రభువులని నమ్మి, వారి సేవకే తన జీవితాన్ని అంకితం చేసి, చివరకు ప్రజాసేవలోనే ప్రాణాలు కోల్పోయిన మానవతావాది ఆయన. 1996 సెప్టెంబర్ 25న గుర్తుతెలియని వ్యక్తుల కాల్పుల్లో మృతి చెందిన డాక్టర్ నారాయణకు నేటితో 30 ఏళ్లు పూర్తవుతున్నా, ఆ ప్రాంత ప్రజల గుండెల్లో ఆయన జ్ఞాపకాలు నేటికీ సజీవంగానే ఉన్నాయి.

పేదల పాలిట ఆపద్బాంధవుడు

గీసుగొండ మండలం మొగిలిచెర్లలో డాక్టర్ నారాయణ 'ప్రజా వైద్యశాల'ను ప్రారంభించారు. కేవలం రూ.5 నామమాత్రపు ఫీజుతో మొగిలిచెర్లతో పాటు చుట్టుపక్కల దాదాపు 30 గ్రామాల పేద ప్రజలకు 24 గంటల పాటు వైద్య సేవలు అందించేవారు. వృద్ధులను ఆప్యాయంగా పలకరిస్తూ వారి కుటుంబ పరిస్థితులు, ఆరోగ్య సమస్యలు తెలుసుకుని భరోసా కల్పించేవారు.

మూడు దశాబ్దాలైనా.. వీడని మిస్టరీ

1996 సెప్టెంబర్ 25న ఉదయం 7.30 గంటల ప్రాంతంలో స్కూటర్‌పై ఏనుమాముల మార్కెట్ మీదుగా మొగిలిచెర్లకు వెళ్తుండగా గుర్తుతెలియని దుండగులు డాక్టర్ నారాయణపై కాల్పులు జరిపారు. ఈ ఘటనలో ఆయన అక్కడికక్కడే మృతి చెందారు. విషయం తెలుసుకున్న చుట్టుపక్కల 30 గ్రామాల ప్రజలు తీవ్ర దిగ్భ్రాంతికి గురై పెద్ద సంఖ్యలో తరలివచ్చారు.మూడు దశాబ్దాలు గడిచినా ఈ ఘటనకు సంబంధించి గుర్తుతెలియని వ్యక్తుల ఆచూకీ, ఘటనకు దారితీసిన కారణాలపై స్పష్టత లేదని కుటుంబ సభ్యులు, స్థానికులు పేర్కొంటున్నారు. పేదల కోసం జీవితాన్ని అంకితం చేసిన ప్రజావైద్యుడి సేవలను ఈ ప్రాంత ప్రజలు నేటికీ స్మరించుకుంటున్నారు.

గణపతి లడ్డూ గణపతికే భద్రకాళి నగర్ 2 ...



హన్మకొండ,సెప్టెంబర్ 24విజయ కెరటం ప్రతినిధి.

భీమారం 55 వ డివిజన్ భద్రకాళి నగర్ 2లో వినాయక నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకొని లక్కీ డ్రా నిర్వహించినట్లు కాలనీ ఉత్సవ కమిటీ అధ్యక్షుడు అల్లేపు రాజు తెలిపారు.ఈ సందర్భంగా కాలనీ కి చెందిన బీద జనార్దన్ లక్ష్మి దంపతులు తమ పేరు పైన కాకుండా గణపతి పేరు మీద కూపన్ కొనుగోలు చేసినట్లు తెలిపారు. గణపతి పేరు మీద డ్రా లో లడ్డూ గెలుపొందటం పట్ల కాలనీ వాసులు ఆనందం వ్యక్తం చేసినట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో విగ్రహ దాత శ్రీనివాసరెడ్డి మరియు. కాలనీ అధ్యక్షుడు విజయకుమార్, సెక్రటరీ వేణు, కోశాధికారి సందీప్ మరియు ఉత్సవ కమిటీ సభ్యులు, కాలనీ కమిటీ సభ్యులు, పిల్లలు, పెద్దలు, మహిళలు సుమారు 200మంది పాల్గొన్నట్లు తెలిపారు.

జర్నలిస్టులకు ఏఐపై శిక్షణ తరగతులు.

నల్లగొండ సెప్టెంబర్ 24 విజయ కెరటం ప్రతినిధి

అక్టోబర్ 3 న నల్గొండ జిల్లా కేంద్రంలోని జిల్లా పరిషత్తు సమావేశ మందిరంలో నల్గొండ డివిజన్ పరిధిలోని జర్నలిస్టులకు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ మరియు సోషల్ మీడియా పై వర్క్ షాప్ నిర్వహిస్తున్నట్లు రాష్ట్ర మీడియా అకాడమీ కార్యదర్శి ఎన్. వెంకటేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు.ఈ వర్క్ షాప్ కు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, సోషల్ మీడియాలో నిష్ణాతులైన రిసోర్స్ పర్సన్లు హాజరుకానున్నారని, ఉదయం ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, సాయంత్రం సోషల్ మీడియా పై వర్క్ షాప్ ఉంటుందని ఆయన తెలిపారు. నల్గొండ డివిజన్ పరిధిలోని జర్నలిస్టులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

విజయ కెరటం
తెలుగు దినపత్రిక

ఫామ్‌హౌస్‌లలో ప్రభుత్వ భూమి ఉంటే నిరూపించండి..

రాజకీయాల నుంచి తప్పుకుంటారా?

కొప్పుల ఈశ్వర్‌కు మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ సవాల్

జగిత్యాల జిల్లా ప్రతినిధి, సెప్టెంబర్ 24 (విజయ కెరటం):



బీఆర్ఎస్ నేతల ఫామ్‌హౌస్‌లలో ప్రభుత్వ భూములు ఉన్నట్లు సాక్ష్యాధారాలతో నిరూపిస్తే రాజకీయాల నుంచి తప్పుకుంటారా అని మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్‌కు రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ సవాల్ విసిరారు.ధర్మారం మండల కేంద్రంలో గురువారం నిర్వహించిన మీడియా సమావేశంలో మంత్రి మాట్లాడుతూ.. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌తో పాటు మాజీ మంత్రులు కేటీఆర్, హరీశ్‌రావు, పల్లా రాజేశ్వర్‌రెడ్డి, గంగుల కమలాకర్ తదితర బీఆర్ఎస్ నాయకుల ఆధీనంలో ప్రభుత్వ భూములు ఉన్నట్లు తేలితే చట్టప్రకారం వాటిని స్వాధీనం చేసుకుంటామని తెలిపారు.కేసీఆర్ ఫామ్‌హౌస్ వద్ద దళితులు ధర్నా చేసిన అనంతరం ఆ ప్రాంతాన్ని పసుపు నీళ్లతో శుద్ధి చేశారన్న అంశంపై మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్, మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ ఇప్పటివరకు ఎందుకు స్పందించలేదని మంత్రి ప్రశ్నించారు. ఈ ఘటనపై కేసీఆర్ క్షమాపణ చెప్పేలా బీఆర్ఎస్ ఎస్సీ సెల్ నాయకులు ఒత్తిడి తీసుకురావాలని అన్నారు.గత ప్రభుత్వ హయాంలో దళితులపై నమోదైన ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులపై తగిన స్థాయిలో సమీక్ష జరగలేదని మంత్రి ఆరోపించారు. ప్రస్తుత ప్రజా పాలనలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధ్యక్షతన రాష్ట్రస్థాయి విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సమావేశం నిర్వహించి ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులపై సమీక్ష చేపట్టినట్లు తెలిపారు.ప్రభుత్వ భూములపై సమగ్ర విచారణ ధర్మారం మండలంలో పేదలకు గతంలో పంపిణీ చేసిన భూములను కొందరు అక్రమంగా కొనుగోలు చేసి, రికార్డులు తారుమారు చేసి అనుభవిస్తున్నారనే ఫిర్యాదులపై పూర్తిస్థాయి విచారణ చేపడుతున్నట్లు మంత్రి తెలిపారు. ప్రభుత్వ, అసైన్మెంట్ భూములు ఆక్రమించినట్లు తేలితే వాటిని స్వాధీనం చేసుకుని అర్హులైన పేదలకు పంపిణీ చేస్తామని స్పష్టం చేశారు. ధర్మారం మండలంలోని సర్వే నంబర్ 676పై సమగ్ర విచారణ కొనసాగుతోందని తెలిపారు. ఓఆర్‌సీ ఎవ్వరు జారీ చేశారు, ఇనాం హక్కుదారులు ఎంతమంది ఉన్నారు, ప్రొహిబిటెడ్ ల్యాండ్‌ను పట్టా భూమిగా ఎలా మార్చారు అనే అంశాలపై విచారణ జరుగుతోందన్నారు.జక్కన్నపల్లి, తహసీల్దార్ కార్యాలయం పక్కన ఉన్న ప్రభుత్వ భూములను లేఅవుట్ చేసి అర్హులైన పేదలకు ఇళ్ల స్థలాలు కేటాయిస్తామని మంత్రి తెలిపారు. పార్టీలు, కులాలకు అతీతంగా నిజమైన అర్హులను గుర్తించి డ్రా పద్ధతిలో స్థలాలు అందజేస్తామని పేర్కొన్నారు. ధర్మారం అభివృద్ధికి ప్రణాళికలు రాష్ట్ర కార్మిక, ఉపాధి కల్పన శాఖ మంత్రి డాక్టర్ వివేక్ చేతుల మీదుగా త్వరలో ఏటీసీ (ఐటీఐ) పనులు ప్రారంభిస్తామని లక్ష్మణ్ కుమార్ తెలిపారు. ధర్మారం మండలం ఎర్రగుంటపల్లిలో ఏటీసీ నిర్మాణం చేపట్టనున్నట్లు వెల్లడించారు. ధర్మారం మండల సమగ్ర అభివృద్ధికి పలు ప్రణాళికలు రూపొందించామని, మండలాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసే దిశగా చర్యలు తీసుకుంటున్నామని మంత్రి తెలిపారు. ఈ సమావేశంలో ధర్మారం మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు రూప్ల నాయక్, మండల సర్పంచుల ఫోరం అధ్యక్షుడు రంజిత్‌తో పాటు వివిధ గ్రామాల సర్పంచులు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు పాల్గొన్నారు.

బావిలో వ్యక్తి పడటంతో కలుషితమైన తాగునీరు.. స్పందించిన కార్పొరేటర్

నల్లగొండ సెప్టెంబర్ 24 విజయ కెరటం ప్రతినిధి 29వ డివిజన్‌లో ఘటన

నల్లగొండ ఓల్డ్ సిటీలోని 29వ డివిజన్ కొండ చల్మా బాయి వద్ద తాగునీటి బావిలో ఓ వ్యక్తి పడటంతో నీరు కలుషితమైన ఘటనపై స్థానిక కార్పొరేటర్ ఖాజా సమీ ఉద్దీన్ (నదీమ్) వెంటనే స్పందించారు. విషయం తెలుసుకున్న వెంటనే సిబ్బందితో కలిసి బావిలోని కలుషిత నీటిని మోటర్ల సహాయంతో పూర్తిగా బయటకు తొలగించి, బావిని శుభ్రం చేయించారు.స్థానిక ప్రజలకు పరిశుభ్రమైన తాగునీరు అందించేందుకు అవసరమైన చర్యలు చేపట్టినట్లు కార్పొరేటర్ తెలిపారు. బావిని శుభ్రపరిచిన అనంతరం రేపటి నుంచి కొండ చల్మా బాయి నీటిని ప్రజలు తీసుకెళ్లవచ్చని ఆయన సూచించారు.తాగునీటి సమస్యపై సమాచారం అందిన వెంటనే స్పందించి, ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని తక్షణ చర్యలు చేపట్టిన కార్పొరేటర్ నదీమ్‌పై స్థానికులు హర్షం వ్యక్తం చేశారు. సమస్యను ఆలస్యం చేయకుండా పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవడంపై ఆయనను అభినందించారు.



స్వచ్ఛత సందేశాన్ని ప్రతి ఇంటికీ తీసుకెళ్లాలి: ఎఫ్‌సీఐ డీఎం సువీన్ కుమార్





నల్గొండ, సెప్టెంబర్ 24: విజయ కెరటం ప్రతినిధి

స్వచ్ఛతను ప్రతి ఒక్కరూ తమ దైనందిన జీవితంలో భాగంగా చేసుకోవాలని, విద్యార్థులు స్వచ్ఛత సందేశాన్ని తమ కుటుంబాలకు, పరిసర ప్రాంతాలకు తీసుకెళ్లాలని ఎఫ్‌సీఐ నల్గొండ డివిజనల్ మేనేజర్ సువీన్ కుమార్ సూచించారు.“స్వచ్ఛతలో భాగస్వామ్యం -- స్వచ్ఛ భారత్, వికసిత భారత్” అనే థీమ్‌తో నిర్వహిస్తున్న స్వచ్ఛతా హి సేవా--2026లో భాగంగా ఎఫ్‌సీఐ నల్గొండ ఆధ్వర్యంలో గురువారం డైట్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల, గొల్లగూడ, నల్గొండలో ‘స్వచ్ఛతా జ్ఞాన యాత్ర’ కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా డీఎం సువీన్ కుమార్ విద్యార్థులతో మాట్లాడుతూ వ్యక్తిగత పరిశుభ్రత, చేతులు శుభ్రంగా కడుక్కోవడం, చెత్తను ఎక్కడపడితే అక్కడ వేయకుండా తడి--పొడి చెత్తగా వేరు చేయడం, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడం వంటి అలవాట్లను చిన్ననాటి నుంచే అలవరచుకోవాలని సూచించారు. విద్యార్థులు స్వచ్ఛత దూతలుగా మారి పరిశుభ్రత ప్రాముఖ్యతను ఇతరులకు తెలియజేయాలని పిలుపునిచ్చారు. అనంతరం విద్యార్థులతో స్వచ్ఛత ప్రతిజ్ఞ చేయించారు.కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు పోలె వెంకటయ్య, ఎఫ్‌సీఐ సీనియర్ అధికారులు పవన్, ఆదిమల్ల శంకర్, కాశిరెడ్డి , ధీరజ్, ఉద్యోగులు షాహిద్, ప్రవీణ్, యమున, మమత, దివ్య, కార్యక్రమ నిర్వాహకులు క్రాంతి, అజయ్, సతీష్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



శర్వానంద్ ‘జార్జ్ క్రిష్’ నుంచి కీలక అప్‌డేట్.. హీరోయిన్ ఎవరో తేలిపోయింది!

‘జార్జ్ క్రిష్’లో హీరోయిన్‌గా మానస వారణాసి

‘కపుల్ ఫ్రెండ్లీ’తో మానసకు మంచి గుర్తింపు

శ్రీను వైట్ల దర్శకత్వంలో సినిమా

సంక్రాంతికి విడుదల చేయనున్నట్లు ప్రకటన

సంగీతం అందించనున్న అనూప్ రూబెన్స్

హీరో శర్వానంద్ కొత్త సినిమా ‘జార్జ్ క్రిష్’పై మరో ఆసక్తికర అప్‌డేట్ వచ్చింది. ఈ సినిమాలో హీరోయిన్‌గా మానస వారణాసిని ఎంపిక చేశారు. శ్రీను వైట్ల దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ చిత్రంలో శర్వానంద్‌కు జోడీగా ఆమె కనిపించనున్నారు.‘కపుల్ ఫ్రెండ్లీ’ సినిమాతో ఇటీవల మంచి గుర్తింపు తెచ్చుకున్న మానస.. తన నటనతో ప్రశంసలు అందుకున్నారు. ఇప్పుడు ‘జార్జ్ క్రిష్’లో ఆమె పాత్రకు చాలా ప్రాధాన్యం ఉంటుందని చిత్ర వర్గాలు చెబుతున్నాయి.శర్వానంద్, శ్రీను వైట్ల తొలిసారి కలిసి పనిచేస్తుండటంతో ఈ సినిమాపై మొదటి నుంచే ఆసక్తి నెలకొంది. శర్వానంద్ వరుస విజయాలతో మంచి జోష్‌లో ఉన్నారు. ‘నారి నారి నడుమ మురారి’, ‘బైకర్’ సినిమాలు ఇటీవల ప్రేక్షకులను అలరించాయి.‘జార్జ్ క్రిష్’ను ఏకే ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్‌పై అనిల్ సుంకర సమర్పిస్తున్నారు. రామబ్రహ్మం సుంకర నిర్మిస్తున్నారు. అజయ్ సుంకర సహ నిర్మాతగా వ్యవహరిస్తున్నారు. సంక్రాంతి కానుకగా సినిమాను విడుదల చేయనున్నారు.శర్వానంద్‌కు సంక్రాంతి సెంటిమెంట్ కూడా ఉంది. ‘శతమానం భవతి’, ‘ఎక్స్‌ప్రెస్ రాజా’, ‘నారి నారి నడుమ మురారి’ వంటి సినిమాలు సంక్రాంతి బరిలోకి వచ్చి విజయాలు అందుకున్నాయి. దీంతో ‘జార్జ్ క్రిష్’పై అంచనాలు పెరుగుతున్నాయి.ఇటీవలే ఈ సినిమా పూజా కార్యక్రమాలతో ఘనంగా ప్రారంభమైంది. తొలి సన్నివేశానికి నిర్మాత సురేశ్‌బాబు కెమెరా స్విచ్ఛాన్ చేయగా.. ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ క్లాప్ కొట్టారు. తొలి షాట్‌కు శ్రీను వైట్ల దర్శకత్వం వహించారు.ఈ చిత్రానికి కేవీ గుహన్ సినిమాటోగ్రాఫర్‌గా పనిచేస్తున్నారు. అనూప్ రూబెన్స్ సంగీతం అందిస్తున్నారు. అవినాశ్ కొల్లా ప్రొడక్షన్ డిజైనర్‌గా, అమర్ రెడ్డి కుడుముల ఎడిటర్‌గా వ్యవహరిస్తున్నారు. నందు సవిరిగాన, గోపీ మోహన్ కథ అందించారు.

Printed, Published Edited and Owned by MAKSOOD AHAMED MOHAMED,H.No. 5-8-222/1, Shams Nagar, BTS Nalgonda - 508 001 (Telangana State) Printed at Shekhar Graphics & Printers H.No. 5-12-719, BTS, NALGONDA 508 001, (Telangana State), Published From: Shekhar Graphics & Printers H.No. 5-12-719, BTS, NALGONDA - 508 001 (A.P.), Editor: MAKSOOD AHAMED MOHAMED Cell: 9908408528